క్లుప్తంగా

మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు



ఎస్ఎస్ తాడ్వాయి: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీతక్కను ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొల్లు రమేష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో సీతక్కను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కూడా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట మండల నాయకులు అబ్బోజు నర్సింహచారి, అయూబ్ పాషా, యువజన నాయకుడు నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



వెంకటాపురం(కె): మండల టీఎన్జీవోస్ యూనిట్ ఎన్నికను జిల్లా కార్యదర్శి పోలురాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా చీకటి వేణు, కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారి చరణ్, వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రాంగోపాల్, పబ్లిసిటీ సెక్రటరీ ఎం హరీష్, ఈసీ మెంబర్‌గా ఆనంద్ బాబు, నరేష్ బాబును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్వరరావు, కోశాధికారి భూక్య లాలూ నాయక్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం చైతన్య పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

గోవిందరావుపేట: మండలంలోని దుంపిల్లగూడెం గ్రామానికి చెందిన దాసరి వెంకట్‌రెడ్డి గత మంగళవారం నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో అతడి భార్య ఫిర్యాదు మేరకు పస్రా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఛేదించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మిస్సింగ్ కేసు దర్యాప్తులో భాగంగా చల్వాయి, దుంపిల్లగూడెం శివారులోని నీటి మడుగులో లభించిన మృతదేహం కనిపించకుండా పోయిన వెంకట్‌రెడ్డిగా గుర్తించారు. సీఐ ఆధ్వర్యంలో విచారణ వేగవంతం చేయగా చల్వాయి గ్రామానికి చెందిన అర్రెమ్ రాజు, పుల్సం సారయ్య, అనే ఇద్దరు వ్యక్తులు అడవి పందులకోసం కరెంటు తీగలు అమర్చగా వాటికి అనుకోకుండా తగిలిన వెంకట్‌రెడ్డి మృతి చెందాడు. భయాందోళనకు గురైన నిందితులు మృతదేహాన్ని నీటిమడుగులో పడేసి పారిపోయారు. ఈనెల 14న నిదుతులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సాయం



మంగపేట: మండలంలోని కత్తిగూడెం గ్రామానికి చెందిన బేరుగు లచ్చినర్సయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శ్రీ రామకృష్ణ సేవాట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేష్ శుక్రవారం పరామర్శించి రూ.25,000 నగదు, 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్‌చైర్మన్ బాడిష నవీన్, గ్రామస్తులు మనుబోతుల రామకృష్ణ, సంతోష్, రవితేజ, సుధీర్, సాయికుమార్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ

మహాముత్తారం: మండలంలోని నల్లగుంట మీనాజీపేట, గండికామారం, గొల్లపల్లె గ్రామాలకు చెందిన నేరెల్ల చిన్న రాజు, స్వరూప, శ్రీనివాస్, సమ్మక్క అనే వ్యక్తులు పలు కారణాలతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ లింగమల్ల శారద, సోషల్‌మీడియా ఇన్‌చార్జ్ పుట్టల వెంకటేష్, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, భూసి దేవేందర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ కిష్టయ్య ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మల్హర్: తాడిచర్ల ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పెద్దతూండ్ల, అడ్వాలపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సహకర సంఘం డైరెక్టర్ ఇప్ప మొండయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

అసంపూర్తిగా 'మనఊరు-మనబడి'



చిట్యాలలోని ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్



ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా నిర్మించిన గదులు

- పాఠశాలల్లో పూర్తి కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

చిట్యాల: గత ప్రభుత్వం పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు విడతల వారిగా పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో మన ఊరు-మనబడి పథకాన్ని ప్రవేశ పెట్టింది. మండలంలోని 25 గ్రామాలకు గాను జూకల్, చల్లగరిగ, గోపాలపూర్, జడల్‌పేట, నైన్‌పాక, చిట్యాలలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. దీంతో పాఠశాల చైర్మన్లు, కాంట్రాక్టర్‌లతో పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ప్రతి పాఠశాలను సందర్శించి పనులు చేసేలా కాంట్రాక్టర్‌లపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్, డ్రికింగ్ వాటర్‌తో పాటు పలు సౌకర్యాలకు నిర్మాణాలు ప్రారంభించారు. అధికారులు ఒత్తిడి చేయడంతో ప్రభుత్వం నుంచి విడతల వారిగా వచ్చే బిల్లులే కాకుండా అప్పులు తీసుకొచ్చి పనులు చేసినట్లు కాంట్రాక్టర్లు వాపోతునానరు. అప్పులు తీసుకువచ్చి చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఉన్న పాఠశాలలో బిల్లులు రాక ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక పోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. దీంతో ఈ పనులకు బిల్లులు చేల్లిస్తుందా.. లేదా అని కాంట్రాక్టర్‌లు ఆందోళనకు చెందుతున్నారు.

బిల్లులు పంపించాం..

మండలంలో గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు-మన బడి పనులకు కాంట్రాక్టర్లు చేసిన పనులకు ప్రభుత్వానికి బిల్లులు పంపించాం. ఆరు గ్రామాలకు మొత్తం రూ.మూడు కోట్ల నిధులతో చేపట్టిన పనులకు ప్రస్తుతం ఒక కోటి రూపాయాలు నిధులు వచ్చాయి. మిగతా పనులకు బిల్లులు చేసి పంపిండం జరిగింది. వచ్చిన వెంటనే మళ్లీ పనులు చేసేలా చర్యలు చేపడుతాం.

-పీఆర్ఏఈ రవి కుమార్, చిట్యాల

ఇబ్బంది పడుతున్నాం..



మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసుతులు కల్పించేందుకు నిర్మాణం చేపట్టాం. అధికారుల ఒత్తిడి మేరకు అప్పులు తీసుకవచ్చి కొంత మేరకు పనులను చేశాను. చేసిన పనులకు ఇంత వరకు బిల్లులు రావడంలేదు. సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేదు. కావున కొత్త ప్రభుత్వం బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

- కట్కూరి నరేందర్, కాంట్రాక్టర్ చిట్యాల

ఫీజు రాయితీ కల్పించాలి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

ములుగు: ప్రజలకు, ప్రభుత్వానికి తాము వారధిగా పనిచేస్తున్నామని తమ పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల ద్వారా 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులు శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, డీఈఓ ఫాణినిలను మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. జర్నలిస్టులు చాలి చాలనీ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గత సంవత్సరం అందించిన విధంగా ఈ సంవత్సరం కూడా 100 శాతం రాయితీ కల్పించాలని డీఈఓతో చర్చించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. కలెక్టర్‌తో మాట్లాడిన అనంతరం నిబంధనల మేరకు తగిన తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో జర్నలిస్టులు టీడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఎండీ షఫీ అహ్మద్, భూక్య సునీల్, సుంకరి సంపత్, బిక్కనూరి సుమన్, గొల్లపల్లి శ్రీనివాస్, చుంచు రమేష్, పోలోజు రామ్మూర్తి, ఎనగందుల శంకర్, గాదం దేవేందర్ , ఎనగందుల కొమురయ్య, సంగ రంజిత్, ముకులోతు శరత్,గుగ్గిల్ల సృజన్ , చల్లగురుకుల రాజు ,చుంచు రమేష్, కూనురు మహేందర్, తొగరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సాక్షి ఎఫెక్ట్..

కాటారం: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలి అని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. 'కాంటాలు పెట్టేదెప్పుడో' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పందించారు. శంకరాంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కాంటాలు జరగకపోవడంపై సంబంధిత అధికారుల నుండి ఆరా తీశారు. కేంద్రాన్ని వెంటనే సందర్శించి వివరాలు అందజేయాలని అదనపు కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం శంకరాంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం నిల్వలు, కాంటాల నిర్వహణపై పీఏసీఎస్ అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. జాప్యం జరగడానికి గల కారణాలను అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. ధాన్యం త్వరితగతిన కాంటాలు వేయాలని రైతులకు ఇబ్బందులు కల్గకుండా చూసుకోవాలని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని భరోసా కల్పించారు. పాడి క్లీనింగ్ పూర్తైన ధాన్యాన్ని ఎలాంటి కోత లేకుండా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైస్ మిల్లర్స్‌తో మాట్లాడి ధాన్యం వెంటనే దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజు, జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, సీఈఓ సతీశ్, సర్పంచ్ అంగజాల అశోక్, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



డీడబ్ల్యూఓకు వినతిపత్రం అందిస్తున్నఅంగన్‌వాడీ టీచర్లు

ములుగు రూరల్: అంగన్‌వాడీ టీచర్లకు నీతి అయోగ్ ఫండ్ ద్వారా పర్సనల్ టీచర్ కిట్లను అంగన్‌వాడీ టీచర్లకు అందించాలని, సమ్మె కాలపు రెండు నెలల వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం డీడబ్ల్యూఓ ప్రేమలతకు అంగన్‌వాడీ టీచర్లతో కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె చేపట్టిన కారణంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడి కొంత మంది టీచర్లకు మాత్రమే అందించడం సరికాదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యలక్ష్మీ , గ్యాస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి డబుల్ గ్యాస్ సిలిండర్ అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు సమ్మక్క, ప్రేమకుమారి, మోక్షరాణి, పద్మారాణి, భాగ్యలక్ష్మీ, జమున రాణి, సరిత, వెంకటేశ్వరి, నిర్మల, కుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీస్ పునఃప్రారంభం



హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ములుగు రూరల్: మండలంలోని అబ్బాపూర్ మీదుగా పరకాల బస్సు సర్వీస్‌ను ఆర్టీసీ అధికారులు శుక్రవారం పునఃప్రారంభించారు. అబ్బాపూర్ బాణాలపల్లి ప్రజలు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు కోరగా ఆర్టీసీ ఉన్నాధికారులతో మాట్లాడి బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించారు. ములుగు నుంచి అబ్బాపూర్, బాణాలపల్లి, గోరికొత్తపల్లి, చెన్నపూర్ మీదుగా పరకాలకు బస్సు నడిపించనున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ క్రైంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టేకుమట్ల: సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ క్రైంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం వర్టికల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెలిశాల, పంగిడిపల్లి, రామకిష్టాపూర్(టీ)లో సైబర్ క్రైం, డయల్ 100పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్ ఫోన్‌లకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి పర్సనల్ లోన్‌ల పేరుతో మెసేజ్, ఫేక్ ఆప్‌లను పంపిస్తూ వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు తీసుకుని మన ఖాతాల్లోని నగదును పూర్తిగా స్వాహా చేస్తారని అన్నారు. కావున గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారాన్ని తెలుపరాదని, ఎలాంటి ఓటీపీలు చెప్పరాదని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి బ్యాంక్ ఖాతా నుంచి నగదును పోగొట్టుకుంటే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు మహేందర్, ఆంజనేయులు, సంతోష్ ఉన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మంగపేట: మండలంలోని రాజుపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో దివ్యాంగుల ఉపాధ్యాయులు, విద్యార్థులకు సన్మాన కార్యక్రమం పాఠశాల హెచ్ఎం రావుల భాస్కర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం భాస్కర్‌రావు దివ్యాంగులైన ఉపాధ్యాలు గడ్డం శ్రీనివాస్, పఠాన్ ఆస్మాబేగం, లక్ష్మయ్య, విద్యార్థులు శివగౌరి, ఆబీస్ లంగరి వరుణ్, ప్రదీప్ పిల్లలను ఘనంగా సన్మానించి వారికి టిఫిన్ బాక్స్‌లను బహుమతిగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో దివ్యాగులను చిన్నచూపు చూడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాయం వీరనారాయణ, పావని, జమున, రాజ్యలక్ష్మి, లావణ్య, పద్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

కాటారం: బ్యాంకు ద్వారా పంట రుణాలు, ఎస్‌హెచ్‌జీ రుణాలు పొందిన వినియోగదారులు సకాలంలో రుణాలు చెల్లించి వడ్డీ రాయితీ ప్రయోజనం పొందాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎల్‌డీఎం తిరుపతి తెలిపారు. మండలంలోని ఆదివారంపేటలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని సూచించారు. టీజీబీ బ్యాంక్ ద్వారా అందించబడుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, జీవన జ్యోతి పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంక్ సేవలపై కళాకారులు కళాజాతా ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ఐలేష్, పీఏసీఎస్ డైరెక్టర్ దండ్రు రాజయ్య, సీఏస్పీ సమ్మిరెడ్డి, దుర్గయ్య, సీఎఫ్ఎల్, కళాజాత బృందం సభ్యులు ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల మార్పిడికి చర్యలు



సమావేశంలో పాల్గొన్న ఆర్‌డీఓ రమాదేవి

చిట్యాల: మండలంలోని ముచినిపర్తి, ఒంటిప్పతండా, వెంకటేశ్వర్లపల్లి, కైలాపూర్, చిట్యాలలో పోలింగ్ బూత్‌లను మార్పిడి చేయుటకు నిర్ణయించినట్లు భూపాలపల్లి ఆర్‌డీఓ రమాదేవి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒంటిప్పతండా గ్రామానికి చెందిన గ్రామస్తుల ఓట్లు వెంచరామి, అందుకుతండా, చైన్‌పాక గ్రామాలలో ఉన్నందున వారికి రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉండడం మూలంగా ఒంటిప్పతండా గ్రామంలో నూతన పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయుటకు చర్చించినట్లు తెలిపారు. అలాగే కైలాపూర్ పాత జీపీలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని నూతన జీపీలోకి మార్చుటకు చర్చించారు. అలాగే మండల కేంద్రంలోని పీఎస్ 165, 167 నంబర్ గల రూమ్‌లలో ఉన్న వాటిని ఉన్నత పాఠశాలకు మార్పిడి చేయుటకు, అలాగే ముచిని పర్తి గ్రామ పంచాయితీలో గల పీఎస్ నంబర్ 160లో వెంకటేశ్వర్లపల్లి గ్రామస్తులకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండడం వలన వెంకటేశ్వర్లపల్లి గ్రామ ఓటర్లను పక్క గ్రామమైన గోపాలపూర్‌లోని పీఎస్ నంబర్159కి మార్చుటకు చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుమన్, ఎంపీడీఓ రామయ్య, ఆర్ఐ రాజు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు సర్వ శరత్, తౌటం నవీన్, ఎంపీటీసీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల నిలుపుదలపై వాగ్వాదం



ఆర్టీసీ అధికారులతో వాగ్వాదం చేస్తున్న భూ సంబంధికులు

కాటారం: మండల కేంద్రంలోని మహదేవపూర్ వైపు గల స్థలంలో శుక్రవారం ఆర్టీసీ అధికారులు బస్సులు నిలుపడానికి ప్రయత్నించడం వివాదస్పదంగా మారింది. కొన్నేళ్ల క్రితం మహదేవపూర్ వైపు విరాళంగా ఇచ్చిన భూమిలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించారు. బస్టాండ్ ప్రారంభానికి నోచుకోక వినియోగంలోకి రాలేదు. దీంతో సదరు భూమికి సంబంధించిన వారు ఆర్టీసీ బస్టాండ్‌ను తొలిగించారు. కొంత కాలం క్రితం సదరు భూమిపై ఆర్టీసీ సంస్థ, భూ యజమానులు వేరు వేరుగా కోర్టులను సంప్రదించి ఎవరికి అనుగుణంగా వారు స్టే ఆర్డర్లు తెచ్చుకున్నారు. కోర్టు ద్వారా ఆర్డర్ కాపీ పొందామని భూపాలపల్లి డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ రవిచందర్, సిబ్బందితో కలిసి ఆ స్థలంలో బస్సులు నిలపడానికి ప్రయత్నించారు. దీంతో భూ యజమానులకు సంబంధించిన బంధువులు బస్సులను అడ్డుకున్నారు. భూమిలోకి బస్సులు వస్తే ఊరుకోబోమని ఆర్టీసీ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఆర్టీసీ అధికారుల సమాచారం మేరకు కాటారం సబ్ డివిజన్ ఎస్సైలు సురేశ్, లక్ష్మణ్‌రావు, రాజ్‌కుమార్, తమాషారెడ్డి, నరేశ్, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. ఆర్టీసీ అధికారులకు కోర్టు ఆర్డర్ ఉన్నందున అడ్డుకోవద్దని భూ సంబంధికులకు సూచించారు. వారు వినకపోవడంతో పలువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి మిగితా వారిని అక్కడి నుండి వెళ్లగొట్టారు.

ఘనంగా కేవీ ఆవిర్భావ దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేవీ డైమండ్ జూబ్లీ ఆవిర్భావ దినోత్సవానికి ములుగు ఎస్పీ గౌష్ ఆలం ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. లక్ష్య సాధనకు ఇష్టపడి చదవాలని తెలిపారు. వేడుకల్లో భాగంగా క్రీడలు, వివిధ రంగాల్లో ఏర్పాటు చేసిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యూత్ పార్లమెంట్ అబ్బుర పరిచింది. కార్యక్రమంలో కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయులు వెంకన్న, పూజ, శ్రీనివాస్, స్మితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఆలయంలో పడిపూజ

మహాముత్తారం: మండలంలోని నల్లగుంటవీఎనాజీపేట గ్రామంలో గల శ్రీరంగనాథస్వామి ఆలయంలో వైస్ ఎంపీపీ గంట ఉమా దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మహా పడిపూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవాలయ ప్రధాన అర్చకులు నరహరిశర్మ, గురుస్వామి సుధాకర్ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ పూజా కార్యక్రమంలో శ్రీపాదట్రస్టు చైర్మన్‌శ్రీనుబాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

రేగొండ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని పానగండ్లలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుధాకర్ ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు చేరుకునేలోగా పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సామగ్రి, స్టడీ సర్టిఫికేట్లు, రూ.లక్ష 20వేల నగదు అగ్నికి ఆహుతైనట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

వారసత్వ ఉద్యోగాలు పునరుద్ధరించాం..

భూపాలపల్లి అర్బన్: టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా గెలిచిన తరువాత వారసత్వ ఉద్యోగాలు పునరుద్ధరించడం జరిగిందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియా బ్రాంచీ ఉపాధ్యక్షుడు బడితెల సమ్మయ్య అన్నారు. ఏరియాలోని కేటీకే 1వ గనిలో శుక్రవారం గేట్ నిర్వహించి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. వారసత్వ ఉద్యోగాలు పునరుద్ధరించడంతో కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు వస్తున్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా ఎక్కడ లేని విధంగా భూపాలపల్లి ఏరియాలో డబుల్ బెడ్ రూం ఇళ్లతో మోడల్ కాలనీ కట్టించినట్లు తెలిపారు. జక్కిరెడ్డి, రవి, సమ్మిరెడ్డి, శశికాంత్ ఉన్నారు.

హక్కుల సాధనకు నిరంతర పోరాటం

భూపాలపల్లి అర్బన్: కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచీ కార్యదర్శి మోటపలుకుల రమేష్ అన్నారు. ఏరియాలోని కేటీకే 5 గనిలో శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించగా ముఖ్యఅతిథిగా రమేష్ హాజరై మాట్లాడారు. కార్మిక పోరాటాల ద్వారా గతంలోని ఏఐటీయూసీ అనేక హక్కులను సాధించి పెట్టిందని అన్నారు. టీబీజీకేఎస్ గెలిచిన పది సంవత్సరాలలో స్ట్రక్చర్ మీటింగ్‌లు నిర్వహించకుండా కార్మిక హక్కులను కాలరాసిందన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలకు కూడా పైరవీలతో కార్మికుల వద్ద డబ్బులు దండుకున్న ఘనత టీబీజీకేఎస్‌దే అని ఆరోపించారు. స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేసే వారే కానీ కార్మికుల పక్షాన ఏనాడు ఐఎన్టీయూసీ పోరాడిన పరిస్థితులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచీ నాయకులు మాతంగి రామచందర్, శ్రీనివాస్, చంద్రమౌళి, రవికుమార్, తిరుపతి, మల్లికార్జున్, రాంచందర్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.